అన్నది. రామలక్ష్మి ఆమాటలు వినిపించుకోలేదు. ఇద్దరూ వెళ్ళిపోయారు.

చీకటి పడింది. నక్షత్రాలు ముగ్గులు పెట్టాయి. చందమామ తరలివచ్చాడు గాలి కదిలింది. నా ఆకులు కొమ్మలు గలగలలాడినవి. ఆకాశాన్నందుకోడానికి ముందుకు సాగినవి. నాలో మళ్ళీ కోరిక తీగెలుసాగినవి. ఆకాశాన్నందుకోలేనా. ఎప్పటికో, ఏమో. దూరాన మబ్బులు ముంచుకు వస్తున్నాయి. గాలి ప్రచండరూపం దాలుస్తోంది. నా స్నేహితురాలు గజగజలాడిపోతోంది. నావేళ్ళు వణుకుతున్నాయి. ఇదే ఆఖరి రాత్రి కాదుగదా.

రేపు ఈ త్రోవన వెళ్ళేపిల్లలు 'పాపం ఈ రెండు చెట్లూ రెండు వేలేండ్లు బ్రతికినవి. ఇన్నాళ్ళకి కూకటివేళ్ళతో పడిపోయాయి, అనుకుంటారు కాబోలు, అంతేకదా.

పారిపోయిన చిలుక
కథల సంపుటి
1963

# పారిపోయిన చిలుక

ఆకాశాన తెల్లనిమేఘాలు అటూ ఇటూ పరుగెడుతున్నాయి, ఏదో తొందరపని ఉన్నట్టు. ఆ కొసనుంచి ఒక తెల్లని మబ్బుతునక ముందుకు పరిగెడితే ఈ కొసనుంచి మరొక పిల్లమబ్బు ముందుకు సాగుతోంది. మధ్యలో రెండూ ఒక క్షణం ఒక్కటిగా మారిపోతున్నాయి. రెప్పపాటులో విడిపోతున్నాయి. మళ్ళా ఎవరి త్రోవ వారిది. ఆకాశాన్ని అలముకొని, అలముకొని రూపాలు మార్చుకొంటున్నాయి– చెదరిన దూది రేకుల్లా, జారిన మల్లె మొగ్గల్లా. ఏవో, ఏవో.

కదలుతూన్న మేఘాలను చూస్తూ గది గుమ్మందగ్గర గడపలో తోటవైపు కూర్చున్న కామాక్షమ్మకు దిగులేసింది. ఎంత చప్పున ఆకారాలు మారిపోతున్నాయి! చూస్తుండగానే చూస్తున్న దృశ్యం మారి మారి పోతున్నది. ఒక రూపానికి అలవాటుపడేలోపల ఎన్నో క్రొత్త రూపాలు! క్షణంలో కదిలి మాయమౌతున్నాయి! ఎంత అందంగా పరుగెడుతున్నాయి! ఎంత ఆప్యాయంగా కౌగిలించుకుంటున్నాయి! ఎంతలో విడిపోతున్నాయి! ఏమి క్షణికాను బంధాలు! అనుకున్నది.

ప్రొద్దు వాలుతోంది. సాయంత్రంవేళ ఈ తోట, ఇల్లూ ఎంత నిశ్శబ్దంగా ఉంటాయో చెప్పలేం! ఇంట్లో ఉన్న నౌకర్లిద్దరిలో ఒకరికది వంట సమయం. మరి ఒకరికి

తిరగబోయ్యే సమయం. ఇక ఇంట్లో అంతా నిశ్శబ్దమే, గాలికి ఆకులు కదిలితే తప్ప!

రోజూ ఈ వేళకు ఈ తోటవైపు గడపదగ్గర అర్థంలేని ఆలోచనలతో దిక్కులు, మబ్బులు, చెట్లూ చూస్తూ కూర్చోడమే కామాక్షమ్మ కార్యక్రమం. దీనికి ఎప్పుడూ మార్పు లేదు.

ఈఇల్లు ఉండడమే ఊరి చివరన ఉన్నది. ఇంటికి మూడు వేపులా మామిడి తోట. పచ్చని ఆకులూ, పచ్చగా కిలకిలమనే చిలుకలూ స్వేచ్ఛగా వస్తూ పోతూంటాయి. తోటవాడు పగలంతా పనిచేస్తాడు. సాయంత్రం వెళ్ళిపోతాడు.

కామాక్షమ్మ భర్త సుందరరావు. అతనికి ఈ తోట పిత్రార్జితం. ఇల్లు స్వార్జితం. ప్రక్క పట్టణంలో ఏదో వ్యాపారం. ఏం వ్యాపారమని కామాక్షమ్మ ఎప్పుడూ అడగలేదు. అడిగినా అతడు చెప్పడు. ఆడవాళ్ళకవన్నీ ఎందుకూ, అనవసర విషయాలు, అని అతని అభిప్రాయం. స్నేహితులతో పేకాడ్డం, స్నేహితురాలితో షికారు కెళ్ళడం ఇల్లాంటివన్నీ ఆ వ్యాపారంలో కొన్ని భాగాలే – ఇవి చెప్పాల్సిన అవసరం లేదు.

ఆ ఊరికి ఉదయమూ, సాయంత్రమూ ఓ రైలు నిద్రపోతూ వస్తుంది. దానికొక టైము లేదు. ఉదయం ఏడు దాటాక ఎప్పుడో వస్తుంది. ప్రక్క పట్నానికి వెడుతుంది. సాయంత్రం ఏడు దాటాక మళ్ళా ఎప్పుడో వెనక్కి తిరిగి వస్తుంది. రోజూ ఆ రైల్లోనే సుందరరావు ప్రయాణం. ఉదయం బయలుదేరి వెళ్ళి మళ్ళా రాత్రికి తిరిగి వస్తుంటాడు. స్టేషనుకు



ఇంటికి రెండుమైళ్ళ దూరం. ఉదయమే స్నానం ఫలహారం చేసి సుందరరావు స్టేషన్‌దాకా నడుస్తాడు. ఏమైనా ఉంటే పట్టుకుని నౌకరు శంకరం కూడా వెడతాడు. ఆ రైలుకు సుందరరావు ప్రయాణం చాల అలవాటు. ఎంత లేటయినా అతను వచ్చేవరకు కదలదు. సాయంత్రం శంకరం మళ్ళా స్టేషన్‌కు వెడతాడు. ఏ ఎనిమిదింటికో సుందరరావుతో కలసి తిరిగివస్తాడు. రోజూ అంతే.

పధ్నాలుగేండ్ల క్రిందట సుందరరావుకు ఈ తోటలో యిల్లుకట్టుకుని ఏకాంతంగా ఉంటే బాగుంటుందని తోచింది. పట్నాల్లో ఏముంది దుమ్ము ధూళి తప్ప యిక్కడ ప్రశాంతంగా ఉంటుంది, పట్నంకూడా దగ్గరే కాబట్టి రోజూ వెళ్ళి పనులు చూసుకోవచ్చు అనుకున్నాడు యిల్లు కట్టాడు. అయితే ప్రస్తుతం ఆ ఏకాంతాన్ని అనుభవిస్తున్నది మాత్రం కామాక్షమ్మ. ఆవిడ ఈ ఏకాంతం కావాలని కోరుకోలేదు. అయినా ప్రాప్తించింది. అంతే, జీవితం. ఒకరు కావాలని కోరుకుంటారు. అది మరొకరికి కోరకుండానే ప్రాప్తిస్తుంది. వారి కది అవసరంలేదు అయినా తప్పదు.

కాపరానికి వచ్చిన కొత్తలో కామాక్షమ్మ అనేది.

“మీకు తెల్లవారిలేస్తే పట్నంలో పని. ఇంక ఇక్కడెందుకూ కాపరం” అని. సుందరరావు వినిపించుకోలేదు.

“ఆ పట్నంలో ఈ ఏకాంతం ప్రశాంతం ఎక్కడ దొరుకుతాయి” అనేవాడు. చీకటిలో వెళ్ళి చీకటిపడ్డాక వచ్చి ఈఇంట్లో అతను అనుభవిస్తున్న ఏకాంతం, ప్రశాంతం

ఏమిటో అతనికే అర్థంకావాలి. కామాక్షమ్మకు అర్థంకాలేదు. అయినా ఆవిడ మాట్లాడలేదు.

ఇల్లుకట్టిన కొత్తలో సుందరరావు వంటవాడు, నౌకరు శంకరం మాత్రమే వుండేవారు. అప్పుడూ అతను ప్రొద్దున వెళితే సాయంత్రమే మళ్ళీరావడం. రెండేళ్లు గడిచాక అతనికో ఆలోచన వచ్చింది. ఈ ఇంట్లో భార్య అనే ఒక వస్తువుకూడ ఉంటే బాగుంటుందనిపించింది. అతనికా ఆలోచన రాగానే ఓ మిత్రుడు అతనికి కామాక్షమ్మను చూపించాడు సుందరరావు ఒప్పుకున్నాడు.

కామాక్షమ్మ పుట్టింటివారిది సామాన్య సంసారం. తండ్రి తెచ్చే నెలజీతం నెల భోజనానికి సరిపోతుంది. మిగుల్చుకోవాలన్న కోరికా, మిగులుతుందన్న ఆశా లేవు. కామాక్షమ్మ ఒక్కతే కూతురు. వంశోద్ధారకుడు ఒక్కడే కొడుకూ, వాడు చెప్పినమాట వినకుండా పరారి అయాడు. నగలు నాణ్యాలు చేయించలేదుగాని, కామాక్షమ్మను గారాబంగానే పెంచారు. థర్డుఫారంవరకు చదివించారు.

కామాక్షమ్మకు చిన్నప్పుడు తీరని కోరికలలో నగల వ్యామోహం ఒకటి. ఎదురింట్లో ఉన్న నాంచారమ్మ కామాక్షమ్మకు చిన్నప్పటి స్నేహితురాలు. నాంచారమ్మకు ఒంటినిండా నగలే. కామాక్షమ్మ బంగారంలాంటి శరీరకాంతి చూచి నాంచారమ్మ అసూయపడేది. నాంచారమ్మ నల్లటి దేహంమీది బంగారునగలు చూచి కామాక్షమ్మ అణచుకోలేని ఆశపడేది. తల్లిని నగలుచేయించమని వేధిస్తే ఆవిడ



"మేమేం చేయించగలం తల్లీ, పెద్దయ్యాక పెళ్ళయితే అత్తగారు నగలు పెడతారులే" అనేది.

అంచేత కామాక్షమ్మ మనస్సులో చిన్నప్పటినుంచి పెళ్ళికీ, నగలకు అవినాభావసంబంధం యేర్పడింది. పెళ్ళయితే నగలు వస్తాయి. అంచేత ఆ ఘడియకొరకు ఎదురుచూడడంకంటే చేసేదేమీ లేదు.

సుందరరావు కామాక్షమ్మను ఎన్నుకున్న తరువాత, తల్లి కామాక్షమ్మను అడిగింది.

"మనిషి బాగానే ఉన్నాడు. ఆస్తి బాగానే ఉందిట. మామిడితోట, మాగాణిభూమి ఏదో వ్యాపారం అన్నీ ఉన్నాయిట, అయితే నీకు పదిహేనేండ్లు అతనికి ముప్పై. నీ అభిప్రాయం ఏమిటి" అని.

కామాక్షమ్మ తన అభిప్రాయం వెలిబుచ్చింది, తల్లి చెప్పినవేవీ వినిపించుకోకుండా.

"ఒంటినిండ నగలు పెడతారా" అని అడిగింది. తల్లి తెల్లబోయింది.

"ఏమో అడగలేదు. ఇంకో సంబంధం అయితే కట్నం ఇచ్చుకోవాలి. మనదగ్గర లేదుగదా!" అని గొణిగింది.

కామాక్షమ్మ చిన్నబుచ్చుకొన్నది. మూడురోజులు మథనపడింది. ఇన్నాళ్ళు ఎదురుచూసింది, పెళ్ళికోసమూ, నగలకోసమూ! మూడోరోజు మధ్యవర్తి మిత్రుడు వార్త తెచ్చాడు. సుందరరావు దగ్గర అతని తల్లి తాలూకు నగలు చాలా ఉన్నాయి. అవన్నీ తప్పనిసరిగా కామాక్షమ్మకే చెందుతాయి. కామాక్షమ్మ ముఖం వికసించింది. తల్లి

సందేహాలన్నీ మనసులోనే అణచుకొని చిరునవ్వు నవ్వింది. వివాహం జరిగింది.

అత్తమామలు అన్నదమ్ములు లేని ఏకాంత గృహంలో తొలిసారి అడుగుపెట్టినప్పుడు కామాక్షమ్మకు అది వింతగా తోచలేదు. ఏ వాతావరణంలో అడుగుపెడితే అదే సహజంగా తోస్తుంది అలవాటు అవుతుంది. కామాక్షమ్మకు ఒంటరిజీవితమే అలవాటయింది. ఎప్పుడో తప్ప ఆ ఒంటరితనం ఆమెకు బాధ అనిపించదు.

ఇంట్లో పని ఏమీలేదు. నౌకర్లు అన్నీ చూచుకుంటారు. కాపరానికివచ్చిన కొత్తల్లో సాయంత్రం కాగానే చక్కగా తలదువ్వుకొని శృంగారించుకొని అత్తగారి తాలూకు నగలన్నీ నెమ్మదిగా అలంకరించుకునేది. అద్దంలో అనేకసార్లు చూచుకునేది. మురిసిపొయ్యేది. తోటంతా తిరిగేది. భర్తకోసం ఎదురుచూచేది. రోజు గడచిపొయ్యేది.

పన్నెండేండ్లయింది. ఇప్పటికీ అంతే. అయితే ఇప్పుడా నగలు మునుపటిలా ఆనందం ఇవ్వడంలేదు. అలవాటుగ అలంకరించుకొన్నా ఏదో బరువుగా భారంగా వుంటున్నాయి. అయినా తీసివెయ్యడానికి బుద్ధిపుట్టదు. కోరి తెచ్చుకున్న బంధాలు కొన్నాళ్ళకి బరువెక్కుతాయి. అయినా అలవాటయిన ఆ బంధాలు తెంపలేము.

సాయంత్రం ఇంటికి వచ్చేటప్పుడే సుందరరావు పత్రిక కొని తెస్తాడు. స్నానం, భోజనం అన్నీ అయ్యాక తోటవేపు వసారాలో ఓ గంట పేపర్లో తలదాచుకుంటాడు. కామాక్షమ్మ తమలపాకులు చిలకలు చుట్టి దొంతర్లు పేరుస్తుంది.



సుందరరావు కొన్ని తీసుకుంటాడు. కామాక్షమ్మ మిగతావి గిల్లిపోస్తూ దిక్కులు చూస్తూ కూర్చుంటుంది. ఇద్దరికి ఏం మాటాడడానికి తోచదు. ఆఖరుకు అలవాటు చొప్పున ఆమె అడుగుతుంది, "పట్నంలో విశేషాలు ఏమిటీ" అని.

అతను పేపరు చదువుతూనే జవాబుచెబుతాడు. "ఏముంటాయి! మామూలే," అని.

అంతే, మళ్ళా మౌనం, మళ్ళా కాస్సేపటికి కామాక్షమ్మ మాటాడుతుంది. సమాధానంకోసం ఎదురుచూడకుండా ఏవో చెబుతుంది.

"మల్లెతీగ రెండు పువ్వులు పూసింది" "ఎర్రగులాబీ మొగ్గ రేపు విచ్చుతుందేమో"

"మామిడిపిందెలు ఎందుకో ఊరికేనే రాలిపోతున్నాయి"

"అబ్బా! సాయంత్రం ఎంత వర్షం! తోటంతా జలప్రవాహమైంది. అకాలవర్షం మంచిది కాదంటారు."

ఇల్లాగే ఏవోఏవో చెబుతుంది. అతను అన్నింటికీ "ఆహా ఊహు" అంటాడు, పరధ్యానంగా! కంఠధ్వనిబట్టి అతను వింటున్నాడో లేదో కూడా చెప్పలేం! చివరకు అతను అంటాడు.

"రేడియోలో మంచిప్రోగ్రాం ఏమైనా ఉందేమో! వినరాదూ" అని.

అంతే. దానితో ఆవిడ లేచిపోతుంది. ముందరివైపు పడకగదిలో ఓమూల బేటరీ రేడియో ఉంది. కామాక్షమ్మ స్విచ్ వేస్తుంది. అరవైరకాల ధ్వనులు వినిపిస్తాయి. వాటి

మధ్యనించి ఏదో సన్నగా పాటకూడా వినిపిస్తుంది. భయంకరమైన నిశ్శబ్దం ఒక్కసారి బ్రద్దలవుతుంది. ఎవరో తోడు ఉన్నారని ఊరట కలుగుతుంది. ఆలోచిస్తూ ఆలోచిస్తూ ఆవిడ నిద్రపోతుంది. అతను గదిలోకి వచ్చినప్పుడు రేడియో ఆపుతాడు.

అంతే అల్లాగే కాలం గడిచింది. ఆ జీవితంలో ఆశా లేదు, నిరాశా లేదు. ఉప్పొంగే ఉత్సాహమూ లేదు. క్రుంగిపోయే విచారమూ లేదు. ప్రశాంతమైన నదిలో కదిలీ కదలని నావలా గడచింది.

ఒక్కసారిమాత్రం పడవ చలించింది. చల్లనిగాలి చవి చూచింది. మోడు చిగిర్చింది. చైతన్యం కదలింది. కామాక్షమ్మ నవ్వింది.

ఆ వేళ ఎండ తీవ్రంగా కాస్తోంది. మధ్యాహ్నం ఒంటిగంటై ఉంటుంది. కామాక్షమ్మ తోటవేపు గదిలో నిద్రపోతోంది, ముందరి వసారాలో ఏదో రెపరెపమన్నది. మగత నిద్రలో కామాక్షమ్మ ఏమిటోనని భయపడింది. మళ్ళీ తోటలోంచి ఏదోపిట్టవచ్చి వసారాలో వాలిందనుకొన్నది. కళ్ళు మూసుకుంది. మళ్లా వసారాలో రెపరెపమని రెక్కలు కొట్టుకున్నాయి. ఏమిటో చూద్దామని లేచివెళ్ళింది. వసారాలో కమ్మీలమీద పంచవన్నెల రామచిలుక నక్కి తల దాచుకున్నది. కామాక్షమ్మను బెదరిబెదరిచూచింది. ఆకుపచ్చని శరీరం రెక్కలసందున ఎరుపు, పసుపు, ఎర్రని ముక్కు, చూడ ముచ్చటగాఉంది. అంత అందమైన చిలుకను కామాక్షమ్మ ఎప్పుడూ చూడలేదు. మంత్రముగ్ధలా అలా చూస్తూ



ఉండిపోయింది. చిలుక పారిపోవాలని ప్రయత్నించింది. మళ్లా రెక్కలుకొట్టుకొని జాలిగా చూస్తూ అక్కడే ఆగిపోయింది. కామాక్షమ్మ దగ్గరకు వెళ్లింది. దాని కాలికి గాయం తగిలింది. అది కదలలేదు. "ఆమె అయ్యో పాపం! ఏ పిల్లో కుక్కో నోటకరచుకొంటే! అమ్మయ్యో!" అనుకున్నది. శంకరాన్ని పిలిచింది. అతను సునాయాసంగా పట్టుకున్నాడు, చిలుక అభ్యంతరం పెట్టలేదు.

కామాక్షమ్మ తనగదిలో తలుపులన్నీ వేయించి జాగ్రత్తగా దానిని దాచుకున్నది. మూడురోజులకు దాని గాయం మానింది. ఈలోపల కామాక్షమ్మ పట్నంనుంచి మంచి పంజరం తెప్పించింది. చిలుక శాశ్వతంగా బందీ అయింది. కామాక్షమ్మకు కావలసినంత కాలక్షేపం దొరికింది, అనుకోకుండా అనుబంధం ఏర్పడ్డది.

ఇప్పుడు ఆమెకు తీరికలేని పని. ప్రతినిమిషం చిలుక ఏంచేస్తుందో అన్న ఆత్రుత. దాని పంజరం శుభ్రంగా ఉన్నది గదా? గదిలోకి పిల్లి ఏదీ వెళ్ళలేదుగదా; తాను పెట్టిన పండుముక్కలు తిన్నదో లేదో! ఇవే ఆలోచనలు, ఆదుర్దాలు; దాని కామె చిన్నారి అని పేరు పెట్టింది. అది ఎప్పుడో మాటలు నేర్చుకొని తియ్యతియ్యగ చిలుకపలుకులు పలుకుతుందని భ్రమ. ఆ భ్రమలో గంటలు గంటలు దానిదగ్గర అర్థంలేని ముద్దుమాటలు తనే వాగేది. ప్రొద్దు గడచినదే తెలిసేదికాదు. సాయంత్రం అది ఎగిరిపోకుండా జాగ్రత్తగా పొదివిపట్టుకొని తోటంతా షికారుచేసేది.

ఇప్పుడావిడకు భర్తతోకూడ అంతులేని కబుర్లు.

ఆదుర్దాగ అతని రాకకోసం ఎదురు చూచేది. రాగానే గబ గబ చెప్పేది.

"చిన్నారి ఇవ్వాళ గుక్కెడు పాలుకూడా తాగలేదు".

"రెండు పండుముక్కలు మాత్రమే తిన్నది".

'పంజరంలోనుంచి తప్పించుకొని రెండు సార్లు గదంతా తిరిగిందండీ! కిటికీతలుపులు వేసున్నాయి గాని లేకపోతే !'

"చిన్నారికి మాటలు వస్తున్నాయండీ; నేను చెబితే త్వరగా నేర్చుకుంటున్నది; ప్రొద్దున నేను "అక్క" అంటే తనూ "అక్క" అన్నది."

ఇల్లాగే గుక్కతిప్పుకోకుండా కొన్ని విచారంతో, కొన్ని అమితోత్సాహంతో, చెప్పుకుపోతుండేది. అతనూ ఆసక్తితోనే వినేవాడు. ఏదో ఉత్సాహం ఉప్పెనలావచ్చి ఆమెను అలముకొన్నది. దాని ఛాయ అతనిమీద వాలింది. నౌకర్లకు వ్యాపించింది. ఇంట్లో వాతావరణమే మారింది.

ఆరు నెలలు కామాక్షమ్మ హృదయం ఆనందం అనుభవించింది. చిన్నారి హృదయం పంజరంలో బందీ అయి పరితపించింది. కామాక్షమ్మ ముఖం చిరునవ్వులతో చిందులాడింది. చిన్నారి రెక్కలు పంజరపు కమ్మీలను కొట్టికొట్టి విసిగి వేసారినాయి.

ఆవేళ మధ్యాహ్నమంతా జోరుగా వానకురిసింది. కిటికీసందులలోనించి జారిన వర్షపునీరు గది అంతా నిండింది. సాయంత్రం వర్షం వెలిసింది. తడిసిన ఆకుసందులోంచి మళ్లా ఎండ తళతళమన్నది.

కామాక్షమ్మ గది అంతా తుడిపించింది. ఆరుతుంది



గదా అని కిటికీరెక్కలు తెరిచింది. చిన్నారితో కబుర్లు చెప్పింది. పంజరం తెరచి పండుముక్కలు పెట్టింది. భోంచేశాక రేడియో పెట్టి, మంచంమీద నడుంవాల్చింది, భర్త కోసం ఎదురుచూస్తూ. ఆవేళ రైలు మామూలుకన్నా చాలా లేటయింది. ఎంతసేపటికి సుందరరావు రాలేదు. ఆలోచిస్తూ, ఆలోచిస్తూ, ఆమె అనుకోకుండా నిద్రపోయింది. ప్రొద్దుపోయి వచ్చిన సుందరరావు ఆమెను లేపలేదు.

మర్నాడు మగతకళ్ళతో కామాక్షమ్మ ప్రక్క మంచంకేసి చూసింది. సుందరరావు నిద్రపోతున్నాడు. పంజరంకేసి చూసింది. చిన్నారిలేదు. పంజరం ఖాళీ. కామాక్షమ్మ అదిరిపడి లేచింది. పంజరం తలుపు తెరచి వుంది. క్రిందటి సాయంత్రం తెరచిన కిటికీలు తెరచినవి తెరచినట్లే ఉన్నాయి. కామాక్షమ్మకు దుఃఖం ముంచుకువచ్చింది. చిలుక ఏమైనట్లు! తను పంజరం తెరచినప్పుడు మళ్ళా మూయలేదు కాబోలు! ఎగిరిపోయి ఉంటుందా? కిటికీలోనించి పిల్లి వచ్చి ఎత్తుకుపోలేదు కదా! భయంతో ఆమె నిలువెల్లా వణకిపోయింది.

నౌకర్లను పిలచి అడిగింది. వాళ్ళకేమీ తెలియదు. ఖాళీ పంజరం చూచి వాళ్లు తెల్లపోయారు. దిగులుతో తోటంతా వెతికారు. ఎక్కడా దొరకలేదు. చేసేది లేక ఊరుకొన్నారు. సుందరరావు లేవగానే చెప్పారు. అతను "అయ్యో పాపం" అన్నాడు, అంతే!

ఆరు నెలలకు ముందు ఆ చిలుక లేదు. ఎక్కడనించి వచ్చిందో ఎందుకు వచ్చిందో తెలియదు: మళ్ళా ఇప్పుడు

ఎక్కడకు వెళ్ళిందో ఎలా వెళ్ళిందో తెలియదు. తెలుసుకునే మార్గం లేదు.

ఖాళీ పంజరం చూసి కామాక్షమ్మ కుమిలి కుమిలి ఏడ్చింది. "నీకేమైనా పిచ్చా" అన్నాడు సుందరరావు. శంకరం పంజరం తీసి దాచాడు. అంతే! ఆ తరువాత ఎవరి పనులు వారు చూచుకున్నారు. వంటవాడు వంటప్రయత్నంలో పడ్డాడు. శంకరం గదులు తుడిచాడు. తోటమాలి చెట్లకు నీళ్లు పెట్టాడు. సుందరరావు రైలు అందదేమోనని తొందర పడ్డాడు. అంతే. అంతకుముందు అక్కడ మరొక ప్రాణి ఉన్న గుర్తుకూడా ఎక్కడా లేదు.

చాలా సేపు కామాక్షమ్మ శూన్యంలోకి చూస్తూ కూర్చున్నది. ఆ చిలుకకూ ఆమెకూ ఉన్న అనుబంధం ఏమిటో, ఆవిడ పొందినదేమిటో, పోగొట్టుకొన్న దేమిటో ఎవరికీ అర్థంకాదు.

"ఈకోటు బొత్తాములన్నీ ఊడిపోయాయి. త్వరగా కుడతావా? రైలువచ్చే టైమైనట్టుంది" అన్నాడు సుందర రావు.

మాట్లాడకుండా లేచి కోటు అందుకున్నది కామాక్షమ్మ. అంతే. ఆ తరువాత ఆవిడ చిన్నారి పేరెప్పుడూ మళ్ళా ఎత్తలేదు.

చాలారోజులకు మళ్ళా మోళ్ళన్నీ చిగిర్చాయి. మళ్ళా వసంతం వచ్చింది. మళ్ళా తోటంతా కిలకిలమంటూ ఆహ్వానం లేకుండానే చిలుకలువచ్చి వాలాయి. మామిడి పూత పరిమళం తోటంతా నిండింది. కామాక్షమ్మ మూగ



హృదయం మళ్లా మేల్కొన్నది.

తోటలో కిలకిలమనే చిలుకలను చూస్తుంటే ఆమెకు ప్రశాంతి కలిగింది.

చాలాకాలానికి ఆవిడమళ్లా తోటకేసి ఉత్సాహంతో చూస్తోందని గ్రహించిన శంకరం దగ్గరగావచ్చి అన్నాడు.

చూడండమ్మా! మామిడిపూత పూయగానే ఎన్ని చిలుకలువచ్చి వాలాయో! ఎంత బాగున్నాయో! మన పంజరం ఒకరోజు తోటలో కట్టిఉంచు తేచాలు, మళ్లా ఏదైనా చిలుక పట్టుబడుతుంది. మనం పెంచవచ్చు.

కామాక్షమ్మ అదిరిపడింది.

'వద్దురా! ఆపనిమాత్రం చెయ్యకు; అవి స్వేచ్ఛగా ఎంత ఆనందంగా ఉన్నాయో చూడు! వాటిని అలాగే హాయిగా బ్రతకనీ! ఇష్టం వచ్చినప్పుడు స్వేచ్ఛగా వస్తాయి, స్వేచ్ఛగా పోతాయి! అదే మనకు ఆనందం! ఎంతసేపైనా వాటినిచూస్తూ కూర్చోవచ్చు. అవన్నీ మనవి కావూ! బలవంతంగా ఒకదాన్నిమాత్రం చెరపట్టి బాధ కొనితెచ్చు కోవడ మెందుకూ! వృథా మమకారం! అన్నది.

ఈ మాటలు శంకరానికి అర్థంకాలేదు, విస్తుపోయి చూస్తూ ఊరుకున్నాడు.

తోటలోని చిలుకలన్నీ ఒక్కసారి కిలకిలా నవ్వాయి.